# తెలివి

చిరుత పులికి తన చర్మం అందంగా ఉంటుందనే గర్వం రోజారోజుకీ పెరిగి పోసాగింది. పెద్దపులి కన్నా కూడా తాను గొప్ప దాన్నని గర్వించసాగింది.

చిన్న జంతువులన్నింటికీ దాని గర్వాన్ని భరించడం కన్నా మరో మార్గం లేకుండా పోయింది. నక్క మాత్రం చిరుతపులికి బుద్ధి చెప్పడానికి సమయం కోసం ఎదురు చూడసాగింది.

ఆ రోజు నక్కని నిలబెట్టి చిరుతపులి తన చర్మం అందం గురించి ప్రగల్భాలు పలకసాగింది. ఒకవేళ వెళ్ళిపోవడానికి ప్రయత్నిస్తే తన పంజాతో ఎక్కడ కొడుతుందో అనే భయంతో ఓపిగ్గా వినసాగింది నక్క.

ఎంత సేపటికి తన ప్రగల్భాల్ని ఆపడంలేదు చిరుత. చివరికి విసిగి "మానవుడు మనకన్నా బలహీనుడయినా మనకన్నా ఉన్నతంగా ఎందుకు జీవిస్తున్నాడనుకుంటున్నావ్! " అని అడిగింది నక్క.



"ఎందుకట?" అడిగింది చిరుత.

"అతనికి అందమైన శరీరం ఉండి కాదు. అంతకన్నా గొప్ప బుర్ర ఉంది!" అంది అక్కసుగా నక్క.

చిరుతపులికి విపరీతమైన కోపం వచ్చింది. ఆ విషయాన్ని గ్రహించిన నక్క ఆపకుండా చెప్పుకు పోసాగింది. "మంచి చర్మమున్న జంతువులు కనిపిస్తే మనిషి విడిచిపెట్టడు. అందుకే నాకు మిమ్మల్ని చూస్తుంటే బాధ వేస్తోంది. " అంటూ "అదుగో మనిషి వస్తున్నాడు" అంది మరి కొంచెం బిగ్గరగా నక్క.

అంతే! మరుక్షణంలో చిరుత అక్కడ నుండి మాయమైపోయింది. తెలివిగా దాని పీడని వదిలించుకున్న నక్క 'బతుకు జీవుడా' అనుకుంటూ వెనుదిరిగింది.

***

Stories for kids- Hudnreds of telugu books.. Just a click away- www.telugubooks.tk
Listen telugu audio books online.
Free telugu books. Telugu Pdf books online…